క్లుప్తంగా

టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

నల్లగొండ టౌన్ : టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మామిళ్ల రాజేందర్ జన్మదిన వేడుకలను ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కంచనపల్లి కిరణ్ కుమార్, జయరావ్, నర్సింహాచారి, మాధవి, మురళి, లక్ష్మయ్య, వరలక్ష్మి, సైదులునాయక్, దుర్గయ్య, కోటేశ్వర్, భాస్కర్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

కనగల్ : మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కూసుకుంట్ల రాజారెడ్డి, చీదేటి వెంకట్‌రెడ్డి, నల్లబోతు శ్రీను, నెలగొందరాశి ముత్తయ్య, నకిరేకంటి యాదగిరి, జిల్లపల్లి రవి, పాలకూరి గణేశ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా సైదులు


సైదులును సన్మానిస్తున్న పాల్వాయి స్రవంతి

మునుగోడు : కాంగ్రెస్ పార్టీ మునుగోడు పట్టణ అధ్యక్షుడిగా బట్లకాల్వకు చెందిన ఆరేళ్ల సైదులును నియమిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి స్రవంతి రెడ్డి ప్రకటించారు. ఆదివారం మునుగోడులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సైదులుకు పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించి ఆయనను పార్టీ కండువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన స్రవంతి రెడ్డితోపాటు జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచితంగా గుండె వైద్యశిబిరం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చెనగోని సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మంజీర హాస్పిటల్ నల్లగొండ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ మలక్‌పేట్ హైదరాబాద్ వారు నిర్వహించే శిబిరంలో కార్డియాలజీ వైద్యులు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ, ఈకో పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేస్తారని సర్పంచ్ తెలిపారు.


స్నేహితురాలికి చేయూత


నగదు అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల : తమతో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఆర్థిక చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పల్లెమోని నిర్మల కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. దీంతో ఆమెతోపాటు కలిసి చదువుకున్న వారు రూ.36,500 నగదు సేకరించి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేరిపోతుల సత్యనారాయణ, జిట్ట చంద్రకాంత్, మాస నరేష్, బడుగు శివకుమార్, చిరబోయిన నర్సింహ, పోలాస కన్నయ్య, కాసం నర్సింహ, అబ్దుల్ ఖాసీం పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి ప్రోత్సాహకం అందజేత

నార్కట్‌పల్లి : ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన తొండలవాయి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని భవానికి అదే గ్రామానికి చెందిన బింగి మహేష్ యాదవ్ అండగా నిలిచారు. భవానిని ఆదివారం శాలువాతో సత్కరించి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫీజు రూ.12 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బింగి కొండయ్య, ఎలగబోయిన మోహన్, స్టాలిన్, సతీష్, శివశంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


భవానిని సన్మానిస్తున్న మహేష్ యాదవ్

రోడ్డు విస్తరణకు మోక్షం

- రూ.16 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఈ నెల చివరిలోగా పనులు ప్రారంభం
- మారనున్న నార్కట్‌పల్లి రూపురేఖలు


నార్కట్‌పల్లిలో విస్తరణ చేపట్టనున్న రోడ్డు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు విస్తరణ పనులకు మోక్షం లభించింది. రూ.16 కోట్లతో నార్కట్‌పల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గత నెల 9వ తేదీన జీఓ నంబరు 12 జారీ చేసింది. విస్తరణలో భాగంగా ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి కార్పొరేషన్ బ్యాంకు వరకు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు వెడల్పు చేయనున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే సర్వే పనులు పూర్తి చేశారు. పరిపాలన సాంకేతిక అనుమతులు కూడా లభించాయి. వారం రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఈ నెల చివరిలోగా రోడ్డు విస్తరణ పనులను చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పు

నార్కట్‌పల్లిని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అందులో భాగంగా రూ.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. రెండున్నర కిలో మీటర్ల మేర పనులకు అమ్మనబోలు చౌరస్తా నుంచి మునుగోడు చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేయనున్నారు. రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల మేర మార్కింగ్ వేస్తున్నారు.

ఈ నెల చివరిలో పనులు ప్రారంభం

నార్కట్‌పల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభం అవుతున్నందున 2.4 కిలో మేర రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు సిద్ధం అయ్యారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులు అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో ఆ శాఖాధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల వివరాలను సేకరించి వాటి కొలతలు కూడా తీశారు. రోడ్డు వెంట సుమారు 25 ఏళ్ల నాటి భారీ వృక్షాలు 159 వరకు గుర్తించారు. ఒక్కో వృక్షం 3–4 మీటర్ల వరకు భూమిలోకి చొచ్చుకుపోయినట్లు తెలుస్తుంది. వీటిని తొలగించడం వల్ల 200 టన్నుల వంట చెరుకు, 130 సీఎంటీ కలప లభిస్తుందని ఆర్అండ్‌బీ అధికారులకు అటవీశాఖ అధికారులు నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా టెండర్లు పిలిచి వృక్షాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. రోడ్డుకు 50 ఫీట్ల లోపు ఉన్న దుకాణాలు తొలగించుకోవాలని గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేయనున్నారు. రోడ్డును పూర్తిగా తొలగించి 1.5 మీటర్ల వెడల్పుతో డివైడర్లు నిర్మించి స్తంభాలకు బటర్‌ఫ్లైలైట్లు అమర్చనున్నారు. రోడ్డుకు ఇరువైపులా 1.5 మీటర్ల వెడల్పుతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నారు. వారంలోగా ఉన్నతాధికారులు పరిశీలన అనంతరం సర్వే నివేదికకు తుది రూపు ఇవ్వనున్నారు.

వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం

నార్కట్‌పల్లిలో రోడ్డు విస్తరణ పనుల టెండర్ల ప్రక్రియను వారంలోగా పూర్తి చేస్తాం. ప్రస్తుతం నిధులు మంజూరు అయినందున వెంటనే పనులను చేపడతాం. ఇప్పటికే సర్వే పూర్తి అయినందుకు రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల మేర మార్కింగ్ ఇచ్చాం. తుది నివేదికను సిద్ధం చేస్తున్నాం.

– బేగ్ ఆర్అండ్‌బీ డీఈ, నల్లగొండ

మోడల్ పట్టణంగా చేయడమే లక్ష్యం



నార్కట్‌పల్లిని మోడల్ పట్టణంగా తయారు చేయడమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి చేస్తున్నా. వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు అన్ని విధాలుగా సహకరిస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. వ్యాపారం కూడా మంచిగా సాగుతుంది.

– చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే

● కుటుంబానికి ఆసరాగా..


ముంజలు కొడుతున్న మునుగోడుకు చెందిన అండాలు


ముంజలు కొడుతున్న కట్టంగూర్‌కు చెందిన స్వరూప

కుటుంబ సభ్యులు తాటి చెట్లు ఎక్కి ముంజకాయలు కోస్తే, వారి కష్టాన్ని తాము కూడా పంచుకుంటూ ఆ ఇంట్లోని మహిళలు జిల్లా కేంద్రానికి వచ్చి ఆ ముంజకాయలు అమ్మి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పలు గ్రామాలకు చెందిన మహిళలు ఆదివారం ఎండను సైతం లెక్క చేయకుండా జిల్లా కేంద్రంలో తాటిముంజలు అమ్ముతూ కనిపించారు.

-సాక్షి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, నల్లగొండ

కార్యకర్తలకు అండగా ఉంటాం

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాజుల శ్రీనయ్యగౌడ్ కుమారుడు మదన్ సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మదన్ సాయిని ఆదివారం కొండేటి మల్లయ్య పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. పన్నాల రాఘవరెడ్డి, కరుణాకర్ రెడ్డి, గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, జాజుల నాగయ్య, పల్‌రెడ్డి శ్రీనివాస్, వేణు, సామ రాంరెడ్డి, సోమయ్య, చింటు, జగన్ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

మునుగోడు : నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి పనులతోపాటు సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించేందుకు సోమవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మునుగోడుకు రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సీఎం కప్ క్రీడలు ప్రారంభించిన అనంతరం నల్లగొండ రోడ్డులోని బ్రిడ్జి నుంచి రైస్ మిల్లుల వరకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా మునుగోడు, చండూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గంగదేవమ్మ ఉత్సవాలు ప్రారంభం


కట్టంగూర్‌లో గంగతెప్పను ఊరేగిస్తున్న యాదవులు

కట్టంగూర్ : యాదవుల ఆరాధ్య దైవమైన గంగదేవమ్మ జాతర కట్టంగూర్‌లో ఆదివారం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా యాదవులు నూతనంగా సుమారు రూ.40 లక్షల వ్యయంతో గంగదేవమ్మ ఆలయాన్ని పునర్నిర్మించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి హోమం, జలాభిషేకాలు చేశారు. ఆదివారం యాదవులు గంగతెప్పను గ్రామంలో డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. సోమవారం అమ్మవారికి బోనాలు, అన్నదాన కార్యక్రమం, మంగళవారం పాడుపు గొర్రె, మాణిక్యమ్మ వేషం, ఆకుమంచమ్మ బోనం, బుధవారం అమ్మవారికి నెలవారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అధ్వానంగా లింక్ రోడ్లు


వర్షాకాలంలో కేతేపల్లి-చెర్కుపల్లి గ్రామాల మధ్య లింక్ రోడ్డు దుస్థితి (ఫైల్)


కంకర తేలి అధ్వానంగా ఉన్న కేతేపల్లి - కొండకిందిగూడెం లింక్‌రోడ్డు

- కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ విషయం అధికారులకు, పాలకులకు తెలిసినా కనీసం మరమ్మతులు చేపట్టేందుకైనా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింక్ రోడ్లు రైతులు పొలాలకు వెళ్లడానికి, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి కూలీలను తెచ్చుకోవడానికి, పండించిన ధాన్యాన్ని ఇంటికి తరలించడానికి ఉపయోగపడతాయి.

మండలంలో ఇలా..

కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు, మరో ఆరు వరకు ఆవాస గ్రామాలు ఉన్నాయి. వీటిలో దాదాపు సగం గ్రామాల ప్రజలు ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్లేందుకు, నాలుగైదు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి లింక్ రోడ్లను వినియోగిస్తున్నారు. చెర్కుపల్లి–కేతేపల్లి మధ్య దూరం కేవలం 4కి.మీ మాత్రమే. ఈరెండు గ్రామాల వ్యవసాయ భూముల కలిసే ఉంటాయి. ఈ దారి వెంట ప్రతిరోజు రెండు గ్రామాల రైతులు, గీత కార్మికులు, ప్రజలు వెళ్తుంటారు. ఈ దారి సరిగా లేకపోవడంతో చెర్కుపల్లి ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి తుంగతుర్తి, ఉప్పలపహాడ్, చీకటిగూడెం గ్రామాల మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కొర్లపహాడ్‌లోని ఆదర్శ పాఠశాలకు కొత్తపేట గ్రామం నుంచి నిత్యం దాదాపు 50 మంది విద్యార్థులు సైకిళ్లపై వెళ్తుంటారు. అయితే రెండు గ్రామాల మధ్య మూడు కి.మీ మేర ఉన్న లింక్‌రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో గుంతలు ఏర్పడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండకిందిగూడెం–కేతేపల్లి మధ్య దూరం 6కి.మీ, తుంగతుర్తి–కేతేపల్లి మధ్య దూరం 5కి.మీ, గుడివాడ నుంచి మూసీ కుడి ప్రధాన కాల్వ వరకు 2 కి.మీ. మాత్రమే ఉంటుంది. కానీ ఈ లింక్ రోడ్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవడానికి 10 నుంచి 15 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ రోడ్లను అభివృద్ధి చేసినట్లయితే ప్రయాణికులకు సమయం కలిసి రావడంతోపాటు రవాణా చార్జీల భారం తగ్గుతుంది. అధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి లింక్ రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మట్టిపాలు

లింక్‌రోడ్ల మరమ్మతులకు స్థానిక ప్రజాప్రతినిధులు అడపాదడపా నిధులు ఖర్చు చేస్తున్నా అవి మట్టిపాలవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మెటల్ రోడ్లతోపాటు మట్టి రోడ్లపై తాత్కాలికంగా ట్రాక్టర్లతో మట్టి పోసిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్లు బురదగా మారి ప్రజలకు మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. శాశ్వతంగా పరిష్కారం చూపకపోవడంతో ఖర్చు చేస్తున్న నిధులు మట్టిపాలవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.

బీటీ రోడ్డుగా మార్చాలి



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు చాలాకాలం నుంచి మట్టి రోడ్డు ఉంది. దగ్గరి దారి కావడంతో నడిచే వెళ్లే వారు ఇదే దారి గుండా వెళ్తుంటారు. రెండు గ్రామాల రైతులకు ఇది అత్యంత ముఖ్యమైనది. ఈ మట్టి రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– బయ్య నాగరాజు, చెర్కుపల్లి

పాలకులు పట్టించుకోవడం లేదు



గ్రామాలను కలిపే లింక్ రోడ్లకు నామమాత్రంగా మరమ్మతులు చేస్తున్నారే తప్ప బీటీ రోడ్డు వేయడం లేదు. దశాబ్దాల క్రితం వేసి మెటల్ రోడ్లన్నీ ప్రస్తుతం కంకర తేలి గుంతలు పడ్డాయి. లింక్‌రోడ్ల అభివృద్ధిపై పాలకులు హామీలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం పట్టించకోవడం లేదు.

– ఆదిమళ్ల సుధీర్, కొండకిందిగూడెం

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు, చిత్రంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో బొడ్రాయి ఉత్సవాలను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో బొడ్రాయి వద్దకు చేరుకుని నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొని బొడ్రాయి దేవతకు పూజలు చేశారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు


నల్లగొండలోని తులసీనగర్ భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల


నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


శాలిగౌరారం : చిత్తలూరులో ఆంజనేయస్వామి ప్రభతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


నల్లగొండలోని బీట్ మార్కెట్ రామకోటి స్తూప ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


నార్కట్‌పల్లి : ఎల్లారెడ్డిగూడెంలో..

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని తులసీ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తాంజనేయ స్వామి మూలవర్యులకు విశేష ద్రవ్య అభిషేకము, అలంకరణ నాగవల్లి దర్శన నిర్వహించారు. తదుపరి శ్రీవల్లీదేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం, శ్రీ భక్తాంజనేయ స్వామి వారి సేవ, ఆలయ బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్ మారగోని నవీన్‌గౌడ్, అభిమన్యు శ్రీనివాస్, నేలపట్ల రమేష్ పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో వంద ఏళ్ల చరిత్ర గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాల్లో భాగంగా హనుమాన్ జయంతి వేడుకలు, శ్రీ సువర్చల సహిత శ్రీ ఆంజనేయ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్టుకు పంచామృత ఫలరసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ సువర్చల సహిత శ్రీ ఆంజనేయ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం వేర్వేరుగా హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ కోటగిరి శ్రీనివాస్, శాశ్వత గౌరవ అధ్యక్షుడు గజ్జల సూర్య ప్రకాష్‌రావు, ప్రతినిధులు చందా కిష్టయ్య, వీరవెల్లి రఘునాథ్, గర్రె శ్రీనివాస్, శివ కోటి ఆంజనేయులు, గుర్రం అంతయ్య, కందాల నారాయణరెడ్డి, పబ్బతి వెంకన్న, బచ్చు హనుమంతు కందగట్ల వెంకటేశ్వర్లు, సంతోష్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : హనుమాన్ జయంతి వేడుకలను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పందెనపల్లి, అయిటిపాముల, మాణిక్యాలమ్మ గూడెం, ఈదులూరు, చెర్వు అన్నారం, కల్మెర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ పగడాల వీరయ్య, ఉప సర్పంచ్ గంట ప్రవీణ్, దేవరకొండ నరేష్, ముప్పిడి యాదయ్య, శ్రీధర్‌రెడ్డి, అయ్యప్ప, దుర్గాప్రసాద్, శోభమ్మ, రుక్కమ్మ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు జానకిరామశర్మ, నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఎల్లారెడ్డిగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డిలు పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్కట్‌పల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మన్ చిరుమర్తి మనోజ్‌కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను సీతాదేవి శ్రీరాముడి విగ్రహాల ఆవిష్కరణ, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, సర్పంచ్‌లు మేడి పుష్పలత శంకర్, దూదిమెట్ల స్రవంతి, ఎంపీటీసీ దుబ్బాక పావని శ్రీధర్, పసునూరి దయకర్, పసునూరి శ్రీనివాస్, దోసపాటి విష్ణుమూర్తి, వడ్డే బైపాల్‌రెడ్డి, రవి, గడ్డం శివరామ్, పసునూరి రమేష్, పుల్లెంల శ్రీనివాస్, బండారు రాంబాబు, కందగట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కేతేపల్లిలో భక్తుల కోలాటాలు, డప్పు, చప్పుళ్ళతో హనుమాన్ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

శాలిగౌరారం : హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో గల శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిత్తలూరు గ్రామంలో ప్రభత్యాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు కనులపండువగా జరిగాయి. ఈసందర్భంగా శ్రీఆంజనేయస్వామి భారీచిత్రపటం, ప్రభలను ఎడ్లబండ్లపై ఊరేగించారు. చిత్తలూరులోని ప్రభత్యాంజనేయస్వామి ఆలయంలో 24 గంటల రామనామ పారాయణం కొనసాగుతోంది. మండలకేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొంగులేటి ప్రత్యేక పూజలు

చిట్యాల : ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళుతూ మార్గమధ్యలో చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఆంజనేయస్వామికి అర్చన చేసి మొక్కులు మొక్కుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వల్లూరి శ్రీలక్ష్మీనర్సింహమూర్తి ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటిని వెలిమినేడు పీఏసీఎస్ డైరెక్టర్ ఎనుగు రఘుమారెడ్డి కలిశారు. అదేవిధంగా వెలిమినేడు ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు.


అధ్యాపకులతో నల్లగొండ ఎన్జీ కళాశాల పూర్వ విద్యార్థులు


శాలిగౌరారం : మాధారంకలాన్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2010–13 బ్యాచ్‌కు చెందిన బీకాం కంప్యూటర్స్ విద్యార్థులు కళాశాలలో కలుసుకుని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దయాకర్, శంకర్, విష్ణు విద్యార్థులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ జెడ్పీహెచ్ఎస్‌లో చదివిన 2002–03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు కిషన్‌రావు, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సిరెడ్డి, ప్రద్యున్నాచారి, వీరయ్య, రంగారెడ్డి, సత్తయ్యలను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వివిధ కారణాల వల్ల మృతిచెందిన 9 మంది సహచరుల కుటుంబాలకు రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

కర్ణాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టులాంటివి


మాట్లాడుతున్న చామల కిరణ్‌కుమార్ రెడ్డి

శాలిగౌరారం : కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు కేంద్రంలోని అధికార బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టులాంటివని టీ పీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చెరుకు సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని కిరణ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం 2023లో జరుగనున్న ఎన్నికల్లో పతనం కాక తప్పదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, ఆకారం, ఇటుకులపహాడ్, భైరవుని బండ సర్పంచ్‌లు కందాల సమరంరెడ్డి, అల్లి సైదులు, దండ రేణుకఅశోక్‌రెడ్డి, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి సమస్య పరిష్కరించాలి

నకిరేకల్ : మున్సిపాలిటీలోని పద్మశాలీ నగర్‌లో మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ అధికారులను కోరారు. నకిరేకల్‌లోని పద్మశాలీ కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. కాలనీలోని మంచి నీటి ట్యాంక్‌లోకి కృష్ణా జలాలు రావడం లేదని కాలనీవాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ మున్సిపాలిటీలో వేసవి కాలంలో నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.